**పడకేసిన పారిశుద్ధ్యం**







**ఎన్‌సీసీ కేడెట్ల ఎంపిక**

AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in




## వినాయకుడికి కలెక్టర్, సీపీ ప్రత్యేక పూజలు

అక్షరటుడే, ఇందూరు: వినాయక ఉత్సవాల్లో భాగంగా జిల్లా కలెక్టరేట్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడికి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. కలెక్టర్, సీపీ స్వయంగా ప్రసాదం వితరణ చేశారు.






# కామారెడ్డి మోడల్‌గా నిలవాలి

- శాఖల మధ్య సమన్వయం అవసరం
- కేంద్ర నిధుల కోసం అధికారులు నివేదికలు పంపాలి
- ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో మరోసారి సమీక్షిస్తా
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**వరదలకు సంబంధించి అంచనాలను ప్రణాళికా బద్ధంగా తయారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకుంటామని తెలిపారు. రాష్ట్రం నుంచి నిధులు మంజూరు చేస్తామని.. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధుల కోసం అధికారులు సరైన రీతిలో నివేదిక పంపాలని సూచించారు. జిల్లాలో వరదల సమయంలో అన్ని శాఖల అధికారులు, పార్టీలకతీతంగా ప్రజా ప్రతినిధుల సహకారంతో ప్రాణ నష్టం, ఆస్తినష్టం, పశు సంపద నష్టం జరగకుండా కాపాడుకోగలిగామన్నారు. ఇందుకు అధికార యంత్రాంగాన్ని అభినందించారు.** —అక్షరటుడే, కామారెడ్డి/లింగంపేట/ఎల్లారెడ్డి

భారీ వరదలతో కామారెడ్డి జిల్లా తీవ్రంగా దెబ్బతిన్నదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సహాయక చర్యల కోసం పటిష్ఠ చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో భారీ నష్టం వాటిల్లింది. దీంతో సీఎం గురువారం జిల్లాలో పర్యటించారు. దెబ్బతిన్న పంటలు, రోడ్లను పరిశీలించారు. అనంతరం పంట నష్టపోయిన రైతులు, వరద బాధితులతో మాట్లాడారు. ఆ తర్వాత కామారెడ్డి కలెక్టరేట్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలు ఎప్పుడూ సమన్వయంతో పనిచేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. కొన్ని శాఖలు వరద బాధితుల కోసం ఎంతో కృషి చేశాయన్నారు. కానీ కొన్ని శాఖల మధ్య సమన్వయ లోపం కనిపించిందని అభిప్రాయపడ్డారు. అన్ని శాఖలతో సమన్వయం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

### అలా చేస్తే యూరియా కొరత రాదు

టోకెన్ సిస్టం అమలు చేస్తే యూరియా కొరత రాదని సీఎం తెలిపారు. యూరియా అందుబాటులో ఉన్నా అధికారుల ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో రైతులు లైన్లలో బారులు తీరి ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సమస్య వచ్చినప్పుడు రాజకీయాలకు అతీతంగా ముందుకు సాగాలని, మానవత్వంతో వ్యవహరించాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసమే తామందరం ఉన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. విపత్తు మేనేజ్‌మెంట్ లో కామారెడ్డి జిల్లా మోడల్‌గా ఉండాలని, తన సూచనలు పకడ్బందీగా అమలు చేస్తే ఇతర జిల్లాల్లో అమలు చేసే అవకాశం ఉంటుందన్నారు.

### మళ్లీ సమీక్ష చేస్తా..

వరదలకు సంబంధించి తాను మళ్లీ 15 రోజుల్లో సమీక్ష చేస్తానని సీఎం పేర్కొన్నారు. ఈ సమయంలో కేవలం కామారెడ్డి, ఎల్లారెడ్డి జిల్లాలకు మాత్రమే నిధులు ఇస్తున్నానని ఇతర ఎమ్మెల్యేలు అనుకోవద్దని, ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేలతో ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క సమీక్షించాలని సూచించారు. సమీక్షకు ఎంపీలు సురేష్ షెట్కార్, అర్వింద్‌లను కూడా ఆహ్వానించాలన్నారు. భవిష్యత్తులో వచ్చే వరదలు, విపత్తులను గుర్తించాలని, అందుకు అవసరమైన ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. ఎమ్మెల్యేలు కూడా వారి నియజకవర్గాల్లో ఉన్న సమస్యలను ఇన్‌ఛార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. జిల్లా ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో హైదరాబాద్ స్థాయిలో 10 రోజుల్లో సమీక్ష చేస్తానన్నారు. ఈ లోపు అధికారుల నివేదికలు కూడా వస్తాయన్నారు.

### నిధులు విడుదల చేస్తాం

నిధుల విడుదలకు ప్రభుత్వం సానుకూలంగా ఉంటుందని, వేగంగా నిధులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎంత మేరకు వస్తే అంత రాబట్టుకోవాలన్నారు. అసెస్‌మెంట్, బిల్స్ రికార్డులు చేయాల్సి వస్తే కేవలం రాష్ట్ర ప్రభుత్వం దాంట్లోనే చేస్తున్నారని, కేంద్రం నుంచి ఎంత తీసుకోవడానికి ఆస్కారం ఉందో అంతమొత్తం రికార్డులో చేయాలని సీఎం పేర్కొన్నారు. మిగతాది రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చినట్లుగా చేయాలని సూచించారు. మంజూరు చేసేటప్పుడు ఒక ఫార్మాట్, బిల్ చేసేటప్పుడు ఒక ఫార్మాట్ తీసుకోవాలన్నారు. ఫ్లడ్ రిలీఫ్ ఫండ్ కేంద్ర ప్రభుత్వం ఎంత ఇచ్చినా ఏ అధికారి దానిని రికార్డు చేయలేకపోతున్నారన్నారు. అది తక్కువ ఉందని, ప్యారామీటర్ ఫిట్ కావడం లేదని పట్టించుకోవడం లేదన్నారు.

కేంద్రం నామ్స్ ప్రకారం పూర్తి రికార్డు బిల్ చేయాలని, ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ఇవ్వకపోతే రాష్ట్ర ప్రభుత్వమే ఇస్తుందని చెప్పారు. సమీక్షలో మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు మదన్ మోహన్ రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, భూపతి రెడ్డి, ఎంపీ సురేష్ షెట్కార్, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర పాల్గొన్నారు.

## గంటకు పైగా వాహనాల నిలిపివేత..

### సీఎంపై ప్రజల ఆగ్రహం



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డిలో సీఎం పర్యటన ప్రజలకు ఆగ్రహం తెప్పించింది. కామారెడ్డి వరద ప్రాంతాల్లో పర్యటించడానికి సీఎం వచ్చిన సందర్భంగా కామరెడ్డితో పాటు పలు ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. లింగంపేట మండలంలో వరద ప్రాంతాలను పరిశీలించిన అనంతరం సీఎం కామారెడ్డి వచ్చే క్రమంలో దేవునిపల్లి దేవివిహార్ వద్ద గంట ముందుగానే వాహనాలను నిలిపివేశారు. లింగంపేట నుంచి సీఎం కాన్వాయి బయలుదేరకముందే వాహనాలు నిలిపివేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 40 నిమిషాలకుపైగా రోడ్డుపై దాదాపు కిలో మీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. రైతులు, చిన్నారులు, మహిళలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. దాంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సీఎం వస్తే ట్రాఫిక్‌ను 40 నిమిషాలసేపు ఆపుతారా అంటూ.. పోలీసులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గంట పాటు వాహనాలు నిలిపివేయడంతో సహనం కోల్పోయిన వాహనదారులు రోడ్డుపైకి వెళ్లి ధర్నా చేసేందుకు సిద్ధమవగా పోలీసులు వారిని సముదాయించారు. కాసేపటికి సీఎం కాన్వాయి రావడంతో హారన్లు కొడుతూ నిరసన తెలిపారు. సీఎం కాన్వాయి పూర్తిగా వెళ్లకముందే వాహనాదారులు బయలుదేరారు.



## శ్రీరాంసాగర్ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

**అక్షరటుడే, మెండోరా :** శ్రీరాంసాగర్‌కు ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి ఉధృతంగా వరద నీరు వస్తోంది. దీంతో క్రమంగా నీటిమట్టం పెరుగుతుండడంతో 23 వరద గేట్లు ఎత్తి గోదావరి నదిలోకి నీరు వదులునున్నట్లు ప్రాజెక్టు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కొత్త రవి తెలిపారు. మహారాష్ట్రలో భారీ వర్షాలు కురవడంతో ప్రాజెక్టులోకి భారీ నీరు వచ్చి చేరుతోంది. నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్ జిల్లాల్లో భారీగా కురిసిన వర్షాలతో ప్రాజెక్టులోకి 1,15, 750 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 1090.00 అడుగులకు (76.104 టీఎంసీలు) చేరింది. ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరుతుండడంతో 23 వరద గేట్లు ఎత్తి 1,26,897 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 3500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. వరద కాలువ ద్వారా 18 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 4500 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు వదులుతున్నారు.



## టీచర్స్ డే ఆకృతిలో విద్యార్థులు

బాల్కొండ వెంకటేశ్వర మదర్ థెరిసా హైస్కూల్‌లో టీచర్స్‌డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఓం గురుభ్యో నమః', 'హ్యాపీ టీచర్స్ డే' అనే అక్షరాల ఆకృతిలో కూర్చుని గురువుల తమకున్న గౌరవాన్ని చాటుకున్నారు. కరస్పాండెంట్ రామలక్ష్మి, హెచ్‌ఎంలు సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు. – అక్షరటుడే, బాల్కొండ

## గణేశ్ శోభాయాత్రకు పటిష్ట భద్రత



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గణేశ్ నిమజ్జన శోభాయాత్రకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలోని అన్ని గణేశ్ నిమజ్జనోత్సవ శోభాయాత్రలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని వివరించారు. అన్ని డివిజన్ల పరిధిలో దాదాపు 1300 మందికిపైగా పోలీస్ సిబ్బందిని నియమించి అడుగడుగునా నిఘా ఏర్పాటు చేశామని సీపీ పేర్కొన్నారు. సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ, ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. పోలీస్ సిబ్బందితో పాటు ఎక్సైజ్, ఫారెస్ట్, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ మొదలగు వారితో బందోబస్తు నిర్వహిస్తున్నారు. నిమజ్జన ఊరేగింపులో ప్రజలంతా శాంతియుతంగా పాల్గొనాలని సీపీ సాయిచైతన్య సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ట్రాఫిక్ నియమాలను అందరూ పాటించాలని తెలిపారు. ఆడియో సిస్టమ్స్ నిర్ణీత స్థాయిలో ఉపయోగించాలన్నారు. డీజేలను పూర్తిగా నిషేధించినట్లు సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. అత్యవసర సమయంలో 100 డయల్, పోలీస్ కంట్రోల్ రూం 8712659700, సంబంధిత పోలీస్ స్టేషన్ వారిని సంప్రదించాలన్నారు.

## వినాయక నిమజ్జనానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు



**అక్షరటుడే, బోధన్:** పట్టణంలో వినాయక నిమజ్జనానికి పూర్తి ఏర్పాట్లు చేయాలని అడిషనల్ కలెక్టర్ అంకిత్ పేర్కొన్నారు. పట్టణంలోని శక్కర్ నగర్, రాకాసీపేట్ లో గణేశ్ విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. పట్టణ శివారులోని చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను, శక్కర్‌నగర్‌లోని వినాయకుల బావి వద్ద ఏర్పాట్లపై అధికారులకు సూచనలు అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. అడిషనల్ కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## ఫైళ్లను పెండింగ్‌లో పెడితే కఠిన చర్యలు



**అక్షరటుడే, ఇందూరు:** నగర పాలక సంస్థలోని రెవెన్యూ విభాగంలో ఫైళ్లను పెండింగ్‌లో పెడితే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ దిలీప్ కుమార్ హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బందితో గురువారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకునేది లేదన్నారు. అధికారులు తమ విధానాన్ని మార్చుకుని ప్రజలకు ఎప్పటికప్పుడు అంతరాయం లేకుండా సేవలు అందించాలన్నారు. అవినీతికి పాల్పడితే సరెండర్ చేయడం లేదా సస్పెండ్ చేయడం జరుగుతుందన్నారు. ఇటీవల ఆర్‌ఐ ఏసీబీకి పట్టుబడటంతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. గతంలోనూ పలువురు అవినీతికి పాల్పడిన ఘటనలు వెలుగు చూశాయి.

## వరద తాకిడి ప్రాంతాల్లో సౌకర్యాలు మెరుగుపర్చాలి

**అక్షరటుడే, ఇందల్వాయి:** ఇటీవల వరద తాకిడికి గురైన ప్రాంతాల్లో సౌకర్యాలను మెరుగుపర్చాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఇందల్వాయి – భీమ్‌గల్ ప్రధాన మార్గంలో ధర్పల్లి మండలం పాటితండా వద్ద వరద ప్రవాహానికి దెబ్బతిన్న వంతెనను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జిల్లాలో ఏకధాటిగా కురిసిన భారీవర్షాలతో సంభవించిన వరదలతో తీవ్రనష్టం వాటిల్లిందన్నారు. అదేవిధంగా సిరికొండ మండలం కొండూర్ శివారులో వరద తాకిడితో దాదాపు కిలోమీటర్ వరకు పెద్దఎత్తున దెబ్బతిన్న బీటీ రోడ్డును, కూలిన హైలెవెల్ బ్రిడ్జి, చెక్ డ్యాంలను పరిశీలించారు. నీట మునిగిన పంటలు, కూలిన విద్యుత్ స్తంభాలు, తెగిపడిన కరెంటు తీగలు, ఇసుక మేటలు వేసిన వరి పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి కొట్టుకుపోయి, బ్రిడ్జి కూలిపోవడంతో ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్నందున ఈ మార్గం మీదుగా వాహనాల రాకపోకలు కొనసాగకుండా కట్టడి చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. తక్షణమే చేపట్టాల్సిన పనుల జాబితాలో కొండూరు రోడ్డు మార్గాన్ని చేర్చి, వెంటనే సౌకర్యాల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వరదల వల్ల దెబ్బతిన్న రోడ్లు, విద్యుత్ వంటి వసతులను సాధ్యమైనంత త్వరగా తిరిగి ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చొరవ చూపాలన్నారు. తాత్కాలిక ప్రాతిపదికన తక్షణమే చేపట్టాల్సిన పనులను, శాశ్వత ప్రాతిపదికన జరిపించాల్సిన పనులను వేర్వేరుగా విభజించుకుని ప్రాధాన్యతా క్రమంలో వాటిని చేపట్టేలా పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. అనంతరం పెద్దవాల్గోట్ గ్రామంలో కొనసాగుతున్న రోడ్డు



పునరుద్ధరణ పనులను కలెక్టర్ పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. వరదలతో దెబ్బతిన్న రోడ్లు, వంతెనలతో ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్నందున అధికారులు, సిబ్బంది అందరూ నిరంతరం అప్రమత్తంగా ఉండి ఎటువంటి ప్రాణ నష్టం సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. స్థానిక రైతులు, ప్రజలతో కలెక్టర్ మాట్లాడుతూ వరదనష్టంపై సమగ్ర వివరాలతో కూడిన నివేదికను రూపొందించి ప్రభుత్వానికి సమర్పిస్తామని అన్నారు. విద్యుత్, రవాణా, మంచినీటి సరఫరా వంటి వసతులను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కలెక్టర్ వెంట పంచాయతీరాజ్ ఈఈ శంకర్ నాయక్, ఎంపీడీవో మనోహర్ రెడ్డి, తహశీల్దార్ రవీందర్ రావు, ఆర్అండ్‌బీ ఏఈ గంగాధర్ తదితరులు ఉన్నారు.



## ఘనంగా గణేశ్ నిమజ్జనోత్సవాలు

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వినాయక నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గురువారం తొమ్మిదో రోజు కావడంతో వివిధ పట్టణాలు, గ్రామాల్లో గణనాథుల నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 7న చంద్రగ్రహణం ఉన్న నేపథ్యంలో నిజామాబాద్ నగరంతో పాటు కామారెడ్డి పట్టణంలోనూ పలు మండపాల నిర్వాహకులు నిమజ్జనం చేస్తున్నారు. నృత్యాలు, భజనలు చేస్తూ వినాయకుడి శోభాయాత్రలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో పోలీసులు బందోబస్తు చేపట్టారు.** – అక్షరటుడే, నెట్‌వర్క్



## బండారి విజయలక్ష్మి ఆస్పత్రిలో అన్నదానం

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని ఖలీల్‌వాడిలో ఉన్న బండారి విజయలక్ష్మి హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏసీపీ రాజా వెంకటరెడ్డి హాజరైన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు బండారి సుజాత, మెడికల్ కళాశాల ప్రొఫెసర్ నాగమోహన్ మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా ఆస్పత్రి ఆవరణలో వినాయక చవితి సందర్భంగా అన్నదానం నిర్వహించామన్నారు. అలాగే ప్రతి గురువారం తమ ఆస్పత్రి ఆవరణలో రోగుల బంధువులకు అన్నదానం చేస్తున్నామని వారు వివరించారు.




## ఉద్యోగులకు పదవీవిరమణ సహజం

**అక్షరటుడే, బాన్సువాడ:** నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో ఐసీడీఎస్ గ్రేడ్-1 సూపర్‌వైజర్ యండమూరి వాణి గురువారం పదవీవిరమణ చేశారు. ఈ సందర్భంగా 28ఏళ్లుగా అంగన్‌వాడీ కార్యకర్తగా ఆమె చేసిన సేవలను తోటి ఉద్యోగులు కొనియాడారు. అనంతరం వాణి మాట్లాడుతూ.. గతంలో అంగన్‌వాడీ టీచర్ అంటే చులకనగా చూసేవారని, కానీ నేడు గ్రామస్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్త లేనిది ఏ పని కాని పరిస్థితులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సువర్ణ, సీడీపీవోలు సౌభాగ్య, కళావతి, నాగమణి, బీర్కూర్ ఏఎంసీ ఛైర్మన్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## పడకేసిన పారిశుధ్యం..
## పట్టించుకోని అధికారులు

**అక్షరటుడే, కోటగిరి:** మండల కేంద్రంలోని పలు కాలనీల్లో పారిశుధ్యం పడకేసింది. భారీవర్షాల అనంతరం కాలనీల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. వర్షాల అనంతరం అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఉన్నతాధికారులు సూచించినప్పటికీ కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు పేర్కొంటున్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో 15రోజుల నుంచి ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోయిందని ప్రజలు ఆగ్రహిస్తున్నారు. మురికినీరంతా రహదారుల పైకి వస్తుండడంతో దుర్వాసన వస్తోందని.. అలాగే దోమల బెడద పెరిగిందని వారు పేర్కొంటున్నారు. పంచాయతీ కార్యదర్శి దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు వాపోయారు. వెంటనే కాలనీల్లోని చెత్తాచెదారాన్ని తొలగించాలని కోరుతున్నారు.







## ఘనంగా గణేశ్ నిమజ్జనోత్సవం



నగరంలో నృత్యం చేస్తున్న టీఎన్జీవోస్ సభ్యులు


వినాయకుల బావిలో గణేశ్ నిమజ్జనం


గణనాథుడి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న ప్రజలు


డిచ్‌పల్లి మండల కేంద్రంలో..


నగరంలోని గణపతుల బావిలో నిమజ్జనం..


దేవునిపల్లి గ్రామంలో..

## వరసిద్ధి వినాయక గణేశ్ మండలి ఆధ్వర్యంలో అన్నదానం



**అక్షరటుడే, బోధన్:** మోస్రా మండల కేంద్రంలో వరసిద్ధి వినాయక్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం, అన్నప్రసాద సేవ కార్యక్రమాలు జరిపించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మాజీ ఎంపీ బీబీ పటేల్, రాష్ట్ర నాయకులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీ నారాయణ, భూపాల్ రెడ్డి, సుదర్శన్ గౌడ్, బాన్సువాడ నియోజకవర్గ నాయకులు కోనేరు శశాంక్, సొసైటీ ఛైర్మన్ జగన్ మోహన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, హన్మాండ్లు, వినోద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ కేడెట్ల ఎంపిక

**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఎన్సీసీ క్యాడెట్లను గురువారం ఎంపిక చేశారు. కార్యక్రమాన్ని 12(టీ) బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ ప్రయజిత్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గంగాధర్ మాట్లాడుతూ.. ఎన్సీసీ ద్వారా విద్యార్థులు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవచ్చని, దీనిద్వారా ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు మరింత విస్తరించాయని పేర్కొన్నారు. ఎంపికలో మొత్తం 150మంది విద్యార్థులు పాల్గొనగా శారీరక దృఢత్వం, రాత పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన 15 మంది విద్యార్థులను ఎన్సీసీ క్యాడెట్లుగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్సీసీ సీటీఓ రమావత్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## వృథాగా పోతున్న నీరు.. పట్టించుకోని అధికారులు

బాల్కొండ మండల కేంద్రంలో పైప్‌లైన్లు పగిలిపోయి నీళ్లు వృథాగా పోతున్నా పట్టించుకోవట్లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కాలనీలకు నీళ్లు సరఫరా చేసే పైప్‌లైన్ పగిలిపోయి కొన్నిరోజులుగా నీరు వృథాగా పోతోందని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీరు లీకేజీ కారణంగా రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయని పేర్కొన్నారు. నీరు వృథాగా పోతున్నా సంబంధిత సిబ్బంది పట్టించుకోవట్లేదని వారు పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణ కాలంలో వేసిన పైప్‌లైన్లు కాబట్టి అవి శిథిలమై ఉంటాయని.. వాటిని మార్చి కొత్తవాటిని వేయించాలని ప్రజలు కోరుతున్నారు. లీకేజీ కారణంగా ఏర్పడిన గుంతల్లో చిన్నారులు, వాహనదారులు పడిపోయే అవకాశాలున్నాయని.. వెంటనే లీకేజీలకు మరమ్మతులు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. - అక్షరటుడే, బాల్కొండ



ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ హౌస్ అరెస్ట్



ఎల్లారెడ్డి పట్టణంలో..






కామారెడ్డి జిల్లా కేంద్రంలో..

## ముందస్తు అరెస్టులు

కామారెడ్డి జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. ఈ నేపథ్యంలో వివిధ పార్టీల నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అదుపులోకి తీసుకున్నారు. అలాగే పలువురు నాయకులను సైతం అరెస్టు చేశారు. – అక్షరటుడే, కామారెడ్డి/ఎల్లారెడ్డి



కామారెడ్డి పట్టణంలో..

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని దేవన్‌పల్లి గ్రామానికి చెందిన బొడ్డు శ్రీవర్ధన్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కును గురువారం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం మండల అధ్యక్షుడు బాదావత్ గోపాల్ నాయక్, జిల్లా జనరల్ సెక్రెటరీ ఎం రాములు నాయక్ చేతుల మీదుగా శ్రీవర్ధన్‌కు గురువారం అందజేశారు. చెక్కు మంజూరుకు కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డికి బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు రిగ్గు గంగాధర్, ఎం.సంతోష్, బొడ్డు చిన్న గంగారాం, మాజీ సర్పంచ్ బొడ్డు దేవాయి గంగారాం, కాంగ్రెస్ నాయకులు లింబాద్రి, పరమేష్, రమేష్, బుచ్చన్న, వోద్దె చిన్ని, స్వామి, బి సుదర్శన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ



**అక్షరటుడే ఇందల్వాయి:** మండలంలోని గన్నారంలో వరద బాధితులకు బీఆర్ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం నిత్యావసరాలను పంపిణీ చేశారు. భారీ వరదల కారణంగా ఇళ్లలోకి నీళ్లు వచ్చి వంట సామగ్రి పూర్తిగా తడిసిపోయాయని.. ఈ మేరకు తాము బాధితు కుటుంబాలకు సాయం చేశామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు వేల్పూర్ గంగారెడ్డి, మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు వేల్పూర్ మైపాల్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కొమ్ముటి రవి హేమంత్ రెడ్డి, భూషణ్ రెడ్డి, కలిగోట సతీష్ రెడ్డి, భూపతి రెడ్డి రవి, నవీన్ లింబారెడ్డి తదితరులు ఉన్నారు.



## పంటల పరిశీలన

**అక్షరటుడే, మెండోర:** మెండోర మండలంలోని చాకిర్యాల్, దూద్ గాం గ్రామాల్లో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద నీటితో పసుపు పంటలు దెబ్బ తిన్నాయి. దీంతో బాల్కొండ డివిజనల్ ఉద్యాన అధికారి పంటలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పసుపు పంటలు నీట మునగడంతో మొగి దెబ్బతిని తోట అంటా పండుబారుతుందని, రేపు కూడా వర్షం ఉన్నందున రైతులు జాగ్రత్తలు తీసుకావాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ సాయి కృష్ణ, హెచ్ఈవో సునీల్, గ్రామ రైతులు పాల్గొన్నారు.



## పంటలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి

**అక్షరటుడే, ఇందల్వాయి:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలో పలు పంటలు దెబ్బతిన్నాయి. దీంతో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ గురువారం ఇందల్వాయి మండలంలోని ఎల్లారెడ్డిపల్లిలో పంటలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో నష్టపోయిన పంటల వివరాలను సర్వే చేస్తున్నామని, ఈ మేరకు ప్రభుత్వానికి అందిస్తామని అన్నారు. అలాగే గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయం తనిఖీ చేసారు. నానో యూరియాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీకాంత్, ఏఈఓ ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అన్ని వృత్తుల్లో కంటే గౌరవప్రదమైనదన్నారు. విలువలతో కూడిన విద్యను అందించి విద్యార్థులు మంచి బాటలో నడిచేవిధంగా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ చంద్రకాంత్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ శంకరయ్య, టీఎస్‌కేసీ ఇన్‌ఛార్జి శివకుమార్, సైన్స్ ఇన్‌ఛార్జి అరుణ్ కుమార్, నాగనిక, ఎన్ఎస్ఎస్ యూనిట్ -1 పీవో ఎస్ చంద్రకాంత్ పాల్గొన్నారు.